ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 31 అక్టోబరు 2025




రేకలకుంటలో సాగులో ఉన్న పొలం.. వేరే వారిపేరుతో నకిలీపట్టా తయారు చేసి ఇచ్చారు

2న వెంకయ్యనాయుడు రాక


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నవంబరు 2వ తేదీన జరిగే జానమద్ది హనుమచ్ఛాస్త్రి (బ్రౌన్ శాస్త్రి) శతజయంతి ఉత్సవాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రానున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ ప్రాంగణంలో నిర్వహించనున్న గ్రంథాలయ సాహిత్య సేవాపుస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 2 వతేదీన పాల్గొంటారని తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. స్వాగతం, కాన్వాయ్, బస ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కాన్వాయ్‌లో 108 వాహనం, మెడికల్ సిబ్బంది ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో జాన్ ఇర్వీన్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా సమాచార శాఖ అధికారి పద్మజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుందూలో 53 వేల క్యూసెక్కుల ప్రవాహం


సీతారామపురం వద్ద బ్రిడ్జిపై ఐదడుగుల ఎత్తుతో ప్రవహిస్తున్న కుందూ నది

చాపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కుందూ నదిలో గురువారం 53 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు చాపాడు చానెల్ ఏఈ గురు మోహన్‌రెడ్డి తెలిపారు. రాజోలి ఆనకట్ట నుంచి 40 వేల క్యూసెక్కులు, పైతట్టు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకల ద్వారా 13 వేల క్యూసెక్కుల నీరు నదిలో వచ్చి చేరినట్లు చెప్పారు. అన్నవరం, సీతారామపురం గ్రామాల వద్ద కుందూ నదిపై నిర్మించిన బ్రిడ్జిలపై అయిదు అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. తహసీల్దారు రమాకుమారి గురువారం బ్రిడ్జీల వద్ద ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు. కుందూ తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆమె హెచ్చరించారు. కుందూ నదిలో వారం రోజుల నుంచి నీటి ప్రవాహం క్రమేణా పెరుగుతూ వస్తోంది. కుందూలో భారీగా వరదనీరు ప్రవహిస్తుండడంతో చాపాడు, సీతారామపురం, కుచ్చుపాప, అల్లాడుపల్లె, పెద్ద గురువలూరు గ్రామాల వద్ద పసుపు పంట దెబ్బతింది. పసుపు కాడల్లోకి నీరు పోయినందున అది కుళ్లిపోతుందని సీతారామపురం గ్రామానికి చెందిన మహిళా రైతు లక్ష్మీదేవి ఆందోళన వ్యక్తం చేశారు.

నష్ట నివేదిక పక్కాగా ఉండాలి


- జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీశ్


వంగ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీశ్

కాశినాయన అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌తో దెబ్బతిన్న ఉద్యాన పంటలను క్షుణ్ణంగా పరిశీలించి నష్ట నివేదికను పక్కాగా తయారు చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీశ్ పేర్కొన్నారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలక్రిష్ణ, బీఎస్ కాంతశ్రీలతో కలిసి మండలంలో తుఫాన్‌తో దెబ్బతిన్న ఉల్లి, మిరప, జామ, అరటి తదితర ఉద్యాన పంటలను ఆయన పరిశీలించారు. ఇటుకులపాడులో పలువురు రైతులతో మాట్లాడి వివాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పంటల నష్ట నివేదిక ఉండాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించామన్నారు. వర్షానికి దెబ్బతిన్న అరటి, బొప్పాయి, టమోటాలాంటి పంటలను కొంతవరకైనా ఎలా దక్కించుకోవాలో రైతులకు తెలియజేశామన్నారు. ఆయన వెంట మండల ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి, రైతు సేవా కేంద్రాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నకిలీ బ్రహ్మాలు

- బ్రహ్మంగారి మఠంలో నకిలీ పట్టాలు, పాస్ పుస్తకాలు తయారీ
- ఒక్కో పాస్ పుస్తకం రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలకు విక్రయం
- భూమి వస్తుందని ఆశతో డబ్బులిచ్చి వీటిని తీసుకున్న పేదలు
- అదే భూమిలో ఒరిజినల్ రైతు
- భూకబ్జాల గుట్టు విప్పేందుకు ప్రత్యేక టీంలు


సోమిరెడ్డిపల్లెలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

బ్రహ్మంగారి మఠం అనగానే రక్కున గుర్తుకు వచ్చేది కాలజ్ఞాన తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి. శతాబ్దాల క్రితమే ఆయన రాబోయే కాలాన్ని గురించి వివరించారు. నాడు బ్రహ్మంగారు చెప్పిన వ్యాఖ్యలన్నీ ఇప్పుడు నిజమవుతున్నాయి. అయితే బ్రహ్మంగారు తాను నడియాడిన నేలలో భూచోళ్లు ఉంటారని గుర్తించలేక పోయినట్లున్నారు. ఇప్పుడు బ్రహ్మంగారిమఠం అంటేనే భూకబ్జాల గడ్డగా, నకిలీలకు అడ్డాగా మారింది.

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో వైసీపీ గ్యాంగ్‌లు కొన్ని చెలరేగిపోయాయి. బ్రహ్మంసాగర్‌లో నీరు ఉండడంతో బ్రహ్మగారిమఠం మండలంలో భూములకు డిమాండ్ వచ్చింది. దీంతో ఇక్కడ ప్రభుత్వ భూముల ఆక్రమణలే కాదు.. నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాల తయారీ అడ్డగోలుగా సాగింది. ఒక బ్యాచ్ మండల పరిధిలోని రేకలకుంట రెవెన్యూ గ్రామంలో 12 మంది పేద రైతులకు నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు తయారు చేసి అంటగట్టారు. రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షలు వసూలు చేసి 1.50 ఎకరాలు, 1.54 ఎకరాలు, 1.42 ఎకరాలు, 1.68 ఎకరాల చొప్పున నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు, డీకేటీలు తయారు చేసి పేదలను మోసం చేశారు. వాస్తవంగా ఈ 12 మందికి ఇచ్చిన సర్వే నెంబర్లు 108లో వివిధ లెటర్ల పేరిట గతంలోనే భూములు ఇచ్చారు. ఖాతా నెంబర్లు కూడా కేటాయించారు. ఈ ఖాతాలపై ఒరిజినల్‌గా రైతులు ఉన్నారు. భూమాయగాళ్లు ఇచ్చిన పట్టాలు తీసుకుని ఆ పేదలు పొలం వద్దకు వెళితే అక్కడ ఒరిజినల్ రైతులు పంటలు సాగుచేశారు. ఖాతా నెంబర్ 990లో సింహం మల్లేశ్ ఉండగా అదే ఖాతా నెంబరు పేరిట మరొకరి పట్టా ఉంది. ఇలా పెద్దఎత్తున నకిలీలు వెలిశాయి. ఇలా మండల వ్యాప్తంగా పెద్దసంఖ్యలో నకిలీ పట్టాలు చేసి పేదలకు అంటకట్టినట్లు చెబుతున్నారు.

భూములు కాపాడుకునేందుకు..

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా భూములను ఆక్రమించిన కొందరు.. వాటిని కాపాడుకునేందుకు ఎన్నికల సమయానికి టీడీపీ గూటికి చేరారు. ఇప్పుడు అక్రమాల గుట్టు బయట పడకుండా ఉండేందుకు, విచారణ జరగకుండా చేసేందుకు తమ ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

రికార్డుల స్వచ్ఛీకరణ

బి.మఠం మండలంలో జరిగిన భూ ఆక్రమణలపై కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రత్యేక దృష్టి పారించారు. ఇక్కడ రికార్డులన్నీ స్వచ్ఛీకరణ చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా భూమి విస్తీర్ణం ఎంత, ఆన్‌లైన్ ఎంత నమోదైంది, భూముల ఆక్రమణలు, నకిలీ పట్టాలు, పాస్‌పుస్తకాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, ఎలాంటి పట్టాలు లేకుండా నేరుగా వెబ్‌ల్యాండ్‌లో ఎంట్రీ చేసినవి.. ఇలా అన్నీ క్షుణ్ణంగా విచారించి కొత్త రికార్డులు తయారు చేయనున్నారు. భవిష్యత్తులో రికార్డులు ట్యాంపరింగ్ జరగకుండా ఉండేలా రికార్డులను తయారు చేయనున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



బ్రహ్మంగారిమఠంలో జరిగిన భూ ఆక్రమణలు, రికార్డుల ట్యాంపరింగ్ నకిలీ పట్టాలు, పాస్‌పుస్తకాల గుట్టు రట్టుచేసేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం. ఒక్కో సచివాలయ పరిధిలో వీఆర్వో, వీఆర్‌ఏ, సర్వేయరుతో కూడిన టీం ఉంటుంది. డిప్యూటీ తహశీల్దారు, ఆర్‌ఐ పర్యవేక్షిస్తారు. బయట మండలాల నుంచి సిబ్బందిని కొంతమందిని నియమిస్తాం. క్షేత్రస్థాయిలో రికార్డులు పరిశీలిస్తారు. మూడు వారాలో నివేదిక ఇస్తారు. నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. భూములు ఆక్రమించి ఉంటే తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఎలాంటి పట్టా, పాస్‌పుస్తకాలు లేకుండా నేరుగా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి ఉంటే అప్పుడు పనిచేసిన తహశీల్దార్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- చంద్రమోహన్, ఆర్డీవో, బద్వేలు

అబ్రకదబ్ర

- భారతి సిమెంట్ మేనేజరా మజాకా
- లేని భూమి ఉన్నట్లు సృష్టి
- డబ్బులు తీసుకుని భూమిచూపని వైనం
- జగన్ హయాంలో జరిగిన అన్యాయం
- ఇప్పుడు కేసు నమోదు


FIFTY RUPEES
Rs.50
INDIA NON JUDICIAL
ANDHRA PRADESH

లేని భూమికి రాసిచ్చిన అగ్రిమెంట్

కడప, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో వ్యవస్థలన్నీ వైసీపీకి జీహుజూర్ అన్నాయి. ఇక జగన్ సంబంధీకులైతే వ్యవస్థలే చతికిలపడిపోయి ఏకపక్షంగా వ్యవహరించాయి. అప్పట్లో భూకబ్జాలే కాదు... లేని భూమిని ఉన్నట్లు చూపించి అమ్మేసేందుకు ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్ తీసుకున్నారు. భూమిలేదని గుర్తించి డబ్బులు ఇవ్వాలని బాధితులు అడిగితే ఇవ్వలేదు. కేసు పెడితే పోలీసులు పట్టించుకోలేదు. చివరకు న్యాయస్థానం ఆదేశాలతో విధిలేని పరిస్థితుల్లో కేసు కట్టాల్సి వచ్చింది. ఈ స్కాంలో సూత్రధారి ఎవరో కాదు.. జగన్ కుటుంబానికి చెందిన భారతి సిమెంట్ మేనేజర్ భార్గవరెడ్డి.

కడప మండలంలోని రవీంద్రనగర్‌కు చెందిన డాక్టర్ పఠాన్ మహబూబ్‌ఖాన్‌కు పొలం కొనాలని ఆశ ఉండేది. భూముల కోసం ప్రయత్నిస్తుండగా కడప మండలంలోని పాయసంపల్లెకు చెందిన మహేశ్వర్‌రెడ్డి కలిశాడు. కడప సమీపంలోనే చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని మామిళ్లపల్లె సర్వే నెంబర్ 72లో ఉన్న రూ.10కోట్ల విలువచేసే 1.80ఎకరాల భూమి రూ.3కోట్లకే వస్తుందని చెప్పాడు. దీంతో పఠాన్ మహబూబ్‌ఖాన్ 4 అక్టోబరు 2023న రూ.60లక్షలు ఇచ్చి అగ్రిమెంట్ రాసుకున్నారు. కడప కోర్టులో పనిచేసే శ్రీనివాసులు తల్లి నాగమునెమ్మ పేరిట భూమి ఉందని, ఈ భూమిలో రాజశేఖర్, చెన్నయ్యలకు భాగం ఉందని, మధ్యవర్తిగా దస్తగిరి ఉంటారని ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే రూ.60లక్షలు తీసుకుని అగ్రిమెంట్ చేసుకున్నారే తప్ప భూమి స్వాధీనం చేయలేదు. అనుమానం వచ్చిన పఠాన్ మహబూబ్‌ఖాన్ అగ్రిమెంట్ మేరకు భూమిని కొలతలు వేయాలని, రిజిస్టర్ చేయించాలని అడిగినా పట్టించుకోలేదు. దీంతో చింతకొమ్మదిన్నె తహశీల్దార్ కార్యాలయంలో విచారించగా.. మామిళ్లపల్లె సర్వే నెంబరు 72లో ఏ భూమిలేదని చెప్పారు. దీంతో బాధితుడు మోసపోయానని గుర్తించి పోలీసులను సంప్రదిస్తే వారుపట్టించుకోలేదు. చివరకు అతను కోర్టులో ప్రైవేట్ కేసు వేయడంతో నెల రోజుల్లోపు కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని న్యాయమూర్తి ఆదేశించడంతో సీకెదిన్నె పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

అయితే ఈ వ్యవహారంలో భారతి సిమెంట్ మేనేజర్ భార్గవరెడ్డి కీలకంగా ఉన్నట్లు చెబుతున్నారు. సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఏడుగురిపై కేసు నమోదైంది. ప్రొద్దుటూరు కోర్టులో పనిచేస్తున్న శ్రీనివాసులును ఏ-1గా చేర్చగా, ఏ-2గా కమలాపురానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి, కడప కోర్టులో డ్రైవర్‌గా పనిచేస్తున్న సుబ్బరాయుడు ఏ-3, రాయచోటిలో పనిచేసే ఎన్.సుబ్బరాయుడు ఏ-4, కడపలో ఓ న్యాయవాది వద్ద పనిచేసే రాజశేఖర్ ఏ-5, దస్తగిరి ఏ-6, భారతి సిమెంట్ మేనేజర్ భార్గవరెడ్డిని ఏ-7గా చేర్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఒకటిన్నర సంవత్సరం దాటినా ఇంకా వైసీపీ నేతల హవా కొనసాగడం, భారతి సిమెంట్ మేనేజర్ ఈ వ్యవహారంలో ఉండడంతోనే సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేయలేదని చెబుతున్నారు. న్యాయస్థానం ఆదేశాలతో విధిలేని పరిస్థితిలో కేసు నమోదు చేయాల్సి వచ్చింది.

నీళ్లు.. కన్నీళ్లు

- నీటమునిగిన సుందరయ్య కాలనీ


సుందరయ్యకాలనీలోని గుడిసెలోకి నీళ్లు చేరిన దృశ్యం

ప్రొద్దుటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురిసిన తుఫానుతో కొత్తపల్లె పంచాయతీలోని సుందరయ్యకాలనీ నీటమునిగింది. వీధులన్నీ జలమయమయ్యాయి. మోకాలు లోతు నీళ్లు నిలబడి ఆ ప్రాంత వాసులకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఎస్టీలు నివసించే ఈ కాలనీలో పూరిగుడిసెల్లోకి వర్షపు నీళ్లు చేరాయి. దీంతో వారు ఆ గుడిసెల్లో నివాసం ఉండే పరిస్థితి లేక మూడు రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు కురవకపోయినా ఆ కాలనీలో చేరిన నీళ్లు వెళ్లే మార్గం లేక తటాకాన్ని తలిపిస్తోంది. విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని వాపోతున్నారు. ఇన్ని రోజులుగా వర్షాలు వస్తున్నా సుందరయ్యకాలనీకి పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు కానీ రాకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తుఫాను వల్ల నష్టపోయిన వారిని ఆదుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా.. ఇక్కడి అధికారులు, ప్రజా ప్రతినిధులు పేదల కాలనీలపై దృష్టి పెట్టడం లేదని ఆవేదన చెందుతున్నారు.

పేదలకు అందని వైద్యం

- వేధిస్తున్న డాక్టర్ల కొరత
- 45 మందికి గాను ఉన్నది 19 మందే
- రేడియాలజిస్ట్ లేక రోగుల తిప్పలు
- ఇదీ పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి తీరు


వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్‌ఫొటో)


ఆసుపత్రిలో స్కానింగ్ డాక్టర్ లేక మూతపడిన స్కానింగ్ గది

పులివెందుల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణ శివారులో మెడికల్ కళాశాల ఏర్పాటుచేశారు. ఇది పూర్తికాకపోవడంతో ప్రస్తుతానికి ఇక్కడ ఆసుపత్రి కొనసాగుతోంది. భవనాలు అత్యాధునికంగా ఉన్నాయి. అలాగే వైద్యానికి అవసరమైన అన్ని పరికరాలు సమకూర్చారు. కానీ ప్రజలకు మాత్రం వైద్యం అందించేందుకు డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. పులివెందుల పట్టణానికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో కడప రోడ్డులో బెస్తవారిపల్లె సమీపంలో ఆసుపత్రి ఉంది. ఈ ఆసుపత్రికి ప్రతిరోజు 200 నుంచి 300 మంది వైద్యం కోసం వస్తున్నారు. సీజనల్ వ్యాధులతోను, దీర్ఘకాలిక రోగాలతోను, కీళ్లనొప్పులతోను తదితర సమస్యలతో ఇక్కడకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటోంది. మొదట డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారు. తర్వాత నిర్వహించే రక్తపరీక్షల ఫలితాలు వచ్చే సమయానికి డాక్టర్లు కనిపించడం లేదని రోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు వందల సంఖ్యలో వైద్యం కోసం వస్తున్నా ఇక్కడ రేడియాలజిస్ట్ (స్కానింగ్ డాక్టర్) లేరు. స్కానింగ్ యంత్రం ఉన్నా రేడియాలజిస్ట్ లేక రోగులు మళ్లీ పులివెందులకు వచ్చి ప్రైవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. ఇక్కడ స్కానింగ్ చేయించుకుని ఆసుపత్రికి వెళ్లేప్పటికి అక్కడ డాక్టర్ ఉండరు. అనారోగ్యంతో వెళ్లే వారు అటూ ఇటూ తిరగడానికి ఓపిక లేక ప్రభుత్వ ఆసుపత్రి ఎందుకు.. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్దామనే భావనకు వస్తున్నారు.

డాక్టర్ల కొరత

పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిని 300 పడకలతో ఏర్పాటు చేశారు. ఇక్కడ 42 నుంచి 45 మంది డాక్టర్లు అవసరం ఉంది. కానీ ప్రస్తుతం 19 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఐదుగురు పీహెచ్‌సీలల్లో విధులు నిర్వహిస్తున్నారు. అంటే ప్రస్తుతం కేవలం 14 మంది మాత్రమే అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అందులోను ఒక డాక్టర్ సూపరింటెండెంట్, మరొక డాక్టర్ ఆర్‌ఎంఓ, ఇంకో డాక్టర్‌కు ఏడీఓగా బాధ్యతలు ఉన్నాయి. అంటే డాక్టర్ల కొరత ఎంత తీవ్రంగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. ముఖ్యంగా రేడియాలజిస్ట్ ఇక్కడెంతో అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యానికి వెళ్లే దాదాపు 50శాతం మంది రోగులకు స్కానింగ్ అవసరం ఉంటోంది. రేడియాలజిస్ట్ లేకపోవడంతో పేదలు స్కానింగ్ కోసం బయటకు పరుగులు తీసి వేల రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. చూడ్డానికి ఆధునిక హంగులతో ఆర్భాటంగా కనిపించే ఆసుపత్రిలో.. సరైన వైద్యం అందక పేదలు ఇబ్బంది పడుతున్నారు.

పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని వసతులు ఏర్పాటు చేసినా డాక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఏ డాక్టర్ ఎప్పుడుంటారో ఎప్పుడు ఉండరో అంతుబట్టడం లేదు. రక్తపరీక్షల ఫలితాలు వచ్చేసరికి డాక్టర్లు కనిపించక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 45 మంది డాక్టర్లు ఉండాల్సిన ఆసుపత్రి కేవలం 19 మందితోనే నడుస్తోంది. దీంతో పేదలకు ఇక్కడ వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు.

ఉన్నవారితోనే మెరుగైన వైద్యం అందిస్తున్నాం

డాక్టర్ల కొరత ఉన్నమాట వాస్తవమే. ఉన్నవారితోనే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ముఖ్యంగా రేడియాలజీ డాక్టర్ ఉంటే 50శాతం సమస్య తగ్గిపోతుంది. ఆసుపత్రి పట్టణానికి దూరంగా ఉండడం మరో సమస్య. ఒక వ్యక్తి ఏదైనా జబ్బుతో ఆసుపత్రికి వస్తే ఒకేరోజు పరీక్షలు నిర్వహించి పూర్తిస్థాయిలో వైద్యం అందించే వెసులుబాటు ఒక్కోసారి ఉండదు. వైద్యపరీక్షల ఫలితాలు ఆలస్యమైతే రెండవరోజు కూడా ఆసుపత్రికి రావాలి. కానీ వారికి ఓపిక లేక రెండవ రోజు రావడానికి ఇష్టపడడం లేదు. ఏవైనా చిన్నచిన్న సమస్యలుంటే పరిష్కరించి రోగులకు మంచి వైద్యం అందించేందుకు కృషిచేస్తాం.

- డాక్టర్ ఎన్.శ్రీనివాసులు, సూపరింటెండెంట్, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి

పెట్రోలు బంకుల్లో అవకతవకలపై విచారణ కమిటీ

కడప క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జైళ్ల శాఖ పరిధిలో కడప, రాజమండ్రి, అనంతపురం, ధర్మవరం, బనగానపల్లెలో పెట్రోలు బంకులు నిర్వహిస్తున్నారు. ఈ బంకుల్లో అవకతవకలతో పాటు అవినీతి జరిగినట్లు పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి వెంకటరెడ్డి, కడప సెంట్రల్ జైలు ఉపపర్యవేక్షణ అధికారి వెంకటేశ్వర్‌రావు, వైజాగ్ సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్, రాజమండ్రి సెంట్రల్ జైలు జైలరు రామారావుతో కమిటీని జైళ్ల శాఖ డీజీ ఏర్పాటు చేశారు. అవకతవకలపై నివేదిక తయారు చేసి ఈ నెల 31 లోగా సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

చెకుముకి మండలస్థాయి పరీక్ష తేదీ మార్పు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న చెకుముకి సైన్స్ సంబరాలు మండలస్థాయి పరీక్షలు నవంబరు 1వ తేదీకి బదులుగా నవంబరు 4వ తేదీ ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి శివరామ్ తెలిపారు. పాఠశాల స్థాయిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి పరీక్షకు హాజరుకావాలని సూచించారు. మండల బాధ్యులు పరీక్ష కేంద్రాలను ప్రకటించి సంబంధిత పాఠశాలలకు సమాచారం అందించాలి. జిల్లాలో సుమారు 350 టీములు పాల్గొననున్నాయి. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్, మెమెంటోలు అందజేయనున్నట్లు తెలిపారు.













అధ్వానం.. ఆసుపత్రి ప్రాంగణం

ఎక్కడి వ్యర్థాలు అక్కడే.. ● ఇదీ సర్వజన ఆసుపత్రి పరిస్థితి

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని పుట్లంపల్లె వద్ద గల కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా అత్యవసర విభాగం ప్రాంగణం వద్ద కాన్పుల వార్డు వద్ద ఈ అపరిశుభ్రత మరీ ఎక్కువగా కనిపిస్తోంది. ఆసుపత్రిలో వేలాది మంది రోగులు తిరుగుతుంటారు. ఆసుపత్రి ప్రాంగణం మరింత అధ్వానంగా ఉండడంతో ఎక్కడ కొత్త రోగాలు వస్తాయోనని రోగుల వెంటవచ్చే బంధువులు వాపోతున్నారు. నూతనంగా ఏర్పాటైన శానిటేషన్ యాజమాన్యం పారిశుధ్యం పనులకు సరైన కెమికల్స్ గాని వస్తువులను కానీ వాడకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. బయో వేస్టేజ్ తీసుకెళ్లడానికి సైతం రోగుల కోసం ఉపయోగించే స్ట్రెచర్ వాడుతూ ఆసుపత్రిలో కనిపిస్తున్నారు. దాదాపుగా వందమంది నూతన పారిశుధ్య కార్మికులను తీసుకున్నట్లు సమాచారం. వీరికి పారిశుధ్య పనిపై సరైన అవగాహన లేకపోవడమే ఒకరకంగా కారణమవు తోంది. జిల్లాలో నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వస్తున్నరోగులు, రోగులు వెంట వచ్చే బంధువులు ఆసుపత్రిలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై విస్మయానికి గురవుతున్నారు. నూతనం గా శానిటేషన్ కాంట్రాక్ట్ తీసుకున్న ఏజెన్సీకి శానిటేషన్ వర్క్‌పై సరైన అవగాహన లేకపోవడమే ముఖ్య కారణంగా చెబుతున్నారు. ఈ విషయంపై సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావును వివరణకోరగా ఆసుపత్రిలో శానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా ఉందని తెలిపారు. కొత్తగా శానిటేషన్ వర్క్ తీసుకున్న ఏజెన్సీ దాదాపు నెల కావస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో ఆసుపత్రిలో శుభ్రతను సరిగాచేయడంలేదన్నారు. ఈ విషయమై శానిటేషన్ ఏజెన్సీని పిలిచి మాట్లాడుతామని రోగులకు వారివెంట వచ్చే బంధువులకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు.


స్ట్రెచర్‌పై బయో వేస్టేజ్ తీసుకెళ్తున్న పారిశుధ్య సిబ్బంది


అపరిశుభ్రంగా ఆసుపత్రి క్యాజువాలిటీ ప్రాంగణం

ఫార్మసీ విద్యకు పెరుగుతున్న ఆదరణ

సీకేదిన్నె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యకు రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని రామిరెడ్డి ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ పొన్నోలు గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఔషధ రంగంలో ఫార్మసీ విద్యకు భద్రతతో కూడిన భవిష్యత్తు నిర్ణయించుకునేందుకు చక్కటి అవకాశం ఉందన్నారు. ఫార్మసీ రంగంలో బీ.ఫార్మసి, డీ.ఫార్మసి, ఎం.ఫార్మసీ, ఫార్మాడీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫార్మసీ రంగంలో ఉపాధి పొందడంతోపాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, పరిశోధనవైపు అవకాశాలు ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు దృష్టి సారిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ సాదు నెల్సన్‌కుమార్ పాల్గొన్నారు.

'మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం'

లింగాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధ్వర్యంలో నడవాల్సిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. లింగాలలో గురువారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు.

బ్రౌన్ జయంతిని ప్రభుత్వం చేపట్టడం అభినందనీయం

కడప మారుతీనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) సీపీ బ్రౌన్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీ యమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మురళి, సాహితీమిత్రులు గంగయ్య, రామలింగయ్య, సత్యనారాయణ ప్రకాశం, వెంకటేశ్ పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్


నగరంలో వాహన తనిఖీలు చేస్తున్న చిన్నచౌకు సీఐ రవికుమార్

కడప క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి రహదారి భద్రతా నిబంధనల గురించి అవగాహన కల్పించారు.

పవర్‌గ్రిడ్, కడప ఆధ్వర్యంలో వాక్‌థాన్-2025



కడప క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ - 2025లో భాగంగా పవర్‌గ్రిడ్, కడప యూనిట్ ఆధ్వర్యంలో వాక్‌థాన్ కార్యక్రమం గురువారం ఉదయం రాజీవ్‌పార్క్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి పవర్‌గ్రిడ్ డీజీఎం హరి వెంకటకుమార్ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చక్రాయపేట ఎంపీడీఓగా రాజశేఖర్‌రెడ్డి



చక్రాయపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండల అభివృద్ధి అధికారిగా గురువారం రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి చక్రాయపేట ఎంపీడీఓగా పని చేస్తూ ప్రమాదంలో గాయపడి సెలవుపైవెళ్లారు. ఆయన స్థానంలో వేంపల్లె ఎంపీడీఓగా కుళాయమ్మకొనసాగారు. తిరిగి ఆయన ఆరోగ్యం కుదుటపడడంతో ఎంపీడీఓ బాధ్యతలు రాజశేఖర్‌రెడ్డి చేపట్టారు.

నష్టపరిహారం ఇవ్వాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వ్యవసాయ, వాణిజ్య పంటలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. గురువారం రైతు సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెన్నా, కుందు, పాపాఘ్ని నదీ పరీవాహక ప్రాంతాలు, బద్వేల్ రెవిన్యూ డివిజన్ ప్రాంతంలో వరిపంట, అరటి, మినుము,కంది, మొక్కజొన్న, పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, మిర్చి తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. అందరికీ నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

'భగవద్గీతపై అనుచిత వ్యాఖ్యలు తగదు'

వేంపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట్లాదిమంది హిందువుల పవిత్ర గ్రంథమైన భగవద్గీతపై టీటీడీ పాలక మండలి సభ్యుడు ఎంఎస్ రాజు అనుచితవ్యాఖ్యలు చేయడం తగదని బీజేపీ జిల్లా అధికారప్రతినిధి గాలి హరిప్రసాద్ హితవుచెప్పారు. వేంపల్లెలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ భగవద్గీత, రామాయణం, మహాభారతం హిందూ సాంప్రదాయంలో పవిత్రమైన గ్రంథాలని, మానవధర్మాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే విషయాలను, సమస్యలు ఎలా పరిష్కరించు కోవాలనే విషయాలను భగవద్గీతలో ఉందన్నారు. విదేశీయులు కూడా భగవద్గీతను మంచిగా చూసుకోవడం పలుచోట్ల చూశామన్నారు. ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు


విజేతలైన విద్యార్థులు వీరే

చెన్నూరు. అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో గంగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో విద్యార్థులకు రాజ్యాంగం పట్ల అవగాహణపై పోటీలు నిర్వహించారు. మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల విద్యార్థులు అందులో పాల్గొన్నారు. ఇందులో చిన్నమాచుపల్లె సంబంధించిన ముగ్గురు విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ఎంపికయ్యారు. అలాగే వక్తృత్వపోటీల్లో రామనపల్లె, చెన్నూరు బాలిక, కొండపేట ఉన్నత పాఠశాలవిద్యార్థులు విజేతలయ్యారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

సెకండ్ ఏఎన్ఎమ్‌ల సమస్యలు పరిష్కరించాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అనేక సంవత్సరాలుగా వైద్య, ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న సెకండ్ ఏఎన్ఎమ్‌ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎంవీ నారాయణమ్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎమ్‌లను సుదూర ప్రాంతాలకు, ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన వేరే జిల్లాలకు బదిలీ చేశారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వేంపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో సాగైన వరిపంటను కడప కృషివిజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధనకేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఇడుపులపాయ, కుమ్మరాంపల్లె గ్రామాల్లో వర్షాలకు పంట దెబ్బతినడంతో పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. శాస్త్రవేత్తలు సుబ్రహ్మణ్యం, శ్రీవల్లి, శిల్పకళ, మానస, ఏఓ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సామాజిక సేవలో ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు

పులివెందుల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి విద్యతో పాటు సామాజిక సేవలో ముందుండాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఇస్లాంపురంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యు.శ్రీనిత ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ అఫీజుల, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ,హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వీరపునాయునిపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనుమాకులపల్లె, తలపనూరు గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు సాగులో ఉన్న మినుము పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంట సాగుచేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఆంజనేయులు నాయక్, గురుప్రసాద్‌నాయక్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పనిపట్ల నిబద్ధత ఉండాలి

చెన్నూరు. అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి పని పట్ల నిబద్ధత కలిగి ఉండాలని డీడీవో మైథిలి అన్నారు. చెన్నూరు ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో గురువారం గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావే శం నిర్వహించి మాట్లాడారు. సచివాలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి వారికి కేటాయించిన విధుల గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఉండాలన్నారు. ఆధార్ విషయంలో సకాలంలో పూర్తి చేయలన్నారు. నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, టీడీపీ కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డితో పాటు ఇంజనీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పులివెందుల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గురువారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎమ్‌యూఏ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు పీఎస్ఎన్‌రావు, జోనల్ నాయకులు రామలింగారెడ్డి, రీజనల్ నాయకులు ఈశ్వరయ్య, డీపో చైర్మన్ రమణ, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎం రెడ్డి మాట్లాడారు. 1/2019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. నాశిరకం పేపర్‌రోల్స్ స్థానంలో నాణ్యమైన పేపర్ రోల్స్ సప్లై చేయాలి, అక్రమ సస్పెన్షన్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకం అమలు ద్వారా రద్దీ పెరిగిన రూట్లలో అదనపు బస్ సౌకర్యం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు సీపీ రెడ్డి, డిపో కార్యదర్శి ఆర్కే రెడ్డి, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కడప మారుతీనగర్..: ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లకు అనుకూలంగా యాజమాన్యం అందించిన 1/2019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేసి తీరాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఆర్టీసీ ఎన్ఎంయూఏ రీజనల్ కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం బయట ఒకరోజు రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూఏ నాయకులు శివారెడ్డి, కోడూరు సుబ్బారావు, కడప డిపో అధ్యక్ష కార్యదర్శులు టి.జయరాం, సగినాల శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్ఎంయూఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పులివెందుల, కడపలో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూఏ నాయకులు, కార్మికులు

అరటి ధరలు పతనం

రెండు నెలలుగా అరటి ధరలు నేలచూపులు చూస్తున్నాయి. గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ స్థాయిలో ధరలు పతనం కావడం ఇదే మొదటిసారి. ఇతర రాష్ట్రాలతో పాటు అరబ్ దేశాలలో పులివెందుల అరటికి మంచి డిమాండ్ ఉంది. అయినా కూడా ధరలు లేవు. ఇతర రాష్ట్రాల నుంచి గానీ, అరబ్ దేశాల నుంచి గానీ అరటికాయలు కావాలని ఆర్డర్లు రావడం లేదని వ్యాపారులు అంటున్నారు. లోకల్ మార్కెట్‌లో టన్ను రూ.4వేలు, ఇతర రాష్ట్రాలకైతే టన్ను రూ.8వేలు, అరబ్‌దేశాలకు టన్ను రూ.12వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ధరలు ఉండడం రైతును కలచివేస్తోంది.


గెలలో చీలిపోతున్న అరటి కాయలు

- ఎగుమతులు లేవంటున్న వ్యాపారులు
- అరబ్‌దేశాలకు తగ్గిన డిమాండ్
- టన్ను రూ.4వేల నుంచి రూ.12వేలు
- నష్టాలు మిగిల్చిందంటున్న రైతులు

పులివెందుల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంతం అరటికి పెట్టింది పేరు. నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం మినహా వేంపల్లె, వేముల, లింగాల, తొండూరు, పులివెందుల, సింహాద్రిపురం మండలాల్లో అరటి సాగులో ఉంది. ముఖ్యంగా లింగాల, పులివెందుల, వేముల మండలాల్లో విస్తారంగా సాగు చేస్తారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 25వేల హెక్టార్లలో అరటి సాగులో ఉంది. అరటి సాగు ఏడాదికేడాది గణనీయంగా ఉంది. ప్రస్తుతం కృష్ణాజలాల రాకతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. నీటి కొరత లేకపోవడంతో పంట సాగు పెరుగుతోంది. అలాగే ఇతర పంటల సాగుకంటే అరటిపంటే లాభదాయకంగా ఉంటుండటంతో రైతులు అరటిపై మొగ్గుచూపుతున్నారు. సింహాద్రిపురం, తొండూరు, వేంపల్లె తదితర మండలాల్లో చీనీతోటలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. కానీ రెండుమూడేళ్లుగా చీనీ తోటలు బంకతెగులుతో ఎకరాలకు ఎకరాలు ఎండిపోతున్నాయి. ఆ పంట తొలగించిన అనంతరం రైతులు కూడా అరటి సాగుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో అరటి సాగు గణనీయంగా పెరుగుతోంది.

రెండు నెలలుగా ధరల పతనం

రెండు నెలలుగా అరటి ధరలు నేలచూపు చూస్తున్నాయి. ఇందుకు ఎగుమతులు లేకపోవడమేనని వ్యాపారులు అంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి, అరబ్‌దేశాల నుంచి ఆర్డర్లు లేకపోవడంతో ఇక్కడ నుంచి ఎగుమతి చేసే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. యూపీ, గుజరాత్ తదితర రాష్ట్రాలలో అరటి పంట కోత దశలో ఉందని, ఇక్కడి కంటే అక్కడే తక్కువ ధరకు దొరుకుతుండడంతో మన అరటికి డిమాండ్ లేదని, అరబ్ దేశాలలో పులివెందుల అరటికి మంచి డిమాండ్ ఉన్నప్పటికీ ఆ రాష్ట్రాలలో చౌకగా దొరుకుతున్న అరటే ఎగుమతి అవుతోందని వ్యాపారులు సెలవిస్తున్నారు. కానీ మూడేళ్లలో ఎప్పుడూ లేని ధరల పతనం రెండు నెలలుగా కొనసాగుతోంది. లోకల్ మార్కెట్‌కు టన్ను రూ.4వేలతో, పశ్చిమబెంగాల్, ఢిల్లీ, ముంబై తదితర రాష్ట్రాలకు టన్ను రూ.8వేల చొప్పున, అరబ్ దేశాలకు మాత్రం డిమాండ్ ఉంటే రూ.12వేలతో రైతుల వద్ద కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. కాగా పులివెందులకు ఢిల్లీ వ్యాపారులు వస్తేనే ధర పెరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఢిల్లీ వ్యాపారులు పులివెందులకు వచ్చి వ్యాపారాలు సాగిస్తారు. దీంతో మరో నెల ఇదే పరిస్థితి ఉంటుందని రైతులు, వ్యాపారులు అంటున్నారు.

తోటల్లోనే చీలిపోతున్న అరటి కాయలు

ప్రస్తుతం అరటి ధరలు పతనం కావడం, వ్యాపారులు తోటల వద్దకు రాకపోవడంతో పక్వానికి వచ్చిన అరటి గెలల్లో కాయలు చీలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాయ పక్వానికి వచ్చిన అనంతరం వీలైనంత త్వరగా గెలను కొట్టి మార్కెట్‌కు తరలించకపోతే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం అరటి తోటల సాగు నుంచి గెల మార్కెట్‌కు తరలించే వరకు ఎకరాకు రూ.1.20లక్షల నుంచి రూ.1.50లక్షల వరకు ఖర్చు అవుతుందని, ఇంత పెట్టుబడి పెట్టి అప్పులపాలు అవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా అరటి ధరలు పతనం కావడం పులివెందుల రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగుల్చుతోంది.


ఆటోకు లోడ్ చేస్తున్న అరటి గెలలు

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు 9 వరకు గడువు

తిరుపతి(విద్య), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వయసును బట్టి 4 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ పరీక్షకు అర్హత ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు 86888 88802, 93999 76999లలో తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

రేపటి నుంచి అండర్-14 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అండర్-14 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు నవంబరు 1వతేదీ నుంచి 14వతేదీ వరకు కడపలో జరగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఇందులో కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడనున్నాయని పేర్కొన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్ఐ, కానిస్టేబుల్, టెట్, డీఎస్సీ ఉద్యోగాల కోసం మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఇదయతుల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, ఏపీ ఆధ్వర్యంలో ముస్లిం, క్రిష్టియన్, సిక్కు, బౌద్ధ, జైన వర్గాల అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగి అర్హులైన అభ్యర్థులు హెచ్‌టీటీపీ/ఏపీసీఈడీఎంఎండబ్ల్యూడీ.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, లేదా బయోడేటాను సీఈడీఎం ఆఫీ సు, భవానీపురం, విజయవాడ-520012 అనే చిరునామాకు పంపవలసిందిగా సూచించారు. మరిన్ని వివరాలకు 9849901140 నెంబరును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్ : వ్యక్తి మృతి


మృతి చెందిన విశ్వనాథ్‌రెడ్డి

కమలాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పారావుపల్లె గ్రామానికి చెందిన మూల విశ్వనాథ్ రెడ్డి (45) స్కూటరు కరెంటు స్తంభాన్ని ఢీకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అన్నదమ్ములైన చెన్నారెడ్డి, విశ్వనాథరెడ్డి గురువారం గ్రామంలో ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి విశ్వనాథ్‌రెడ్డి బైకులో వెళుతూ విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య భారతి, కుమారుడు యశ్వంత్, కుమార్తె జాహ్నవి ఉన్నారు. ఈ విషయంపై ఎస్ఐ విద్యాసాగర్‌ను వివరణ కోరగా, విద్యుత్ స్తంభానికి బైకు ఢీకొని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

రైలుకింద పడి లారీ డ్రైవర్ మృతి

కొండాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) మండలంలోని కొండాపురం సమీపంలో ఉన్న రైల్వేబ్రిడ్జి దగ్గర రైలుకింద పడి రామకృష్ణ(50) అనే లారీ డ్రైవర్ మృతి చెందాడు. మండలంలోని డొంకపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణ గురువారం సాయంత్రం గూడ్సు రైలుకింద పడి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. రామకృష్ణ గత కొంత కాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడని, నొప్పికి తాళలేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని బంధువులు తెలిపారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురైన రైతు

చక్రాయపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబొమ్మనపల్లె పంట పొలాల్లో ప్రమాదవశాత్తు వెంకటనారాయణ అనేరైతు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుమార్లకాల్వ గ్రామానికి వెంకటనారాయణ ఎర్రబొమ్మనపల్లె గ్రామ పొలంలో నిమ్మపంటను సాగు చేశాడు. గురువారం నిమ్మ తోటవద్దకు వెళ్లగా తన పొలంలో ఉన్న మోటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమావశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కాగా విద్యుత్ షాక్‌కు గురైనపుడు ఫీజు కట్ అవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆ ప్రాంత రైతులు గాయపడిన వెంకటనారాయణను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ప్రాణాపాయం నుంచి రైతు బయటపడడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

పట్టపగలే చోరీ
20 తులాల బంగారం అపహరణ

కమలాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని స్టేట్‌బ్యాంక్ ఎదురు సందులో ఉన్న రెడ్డికాలనీలో దొంగతనం జరిగిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఆ వివరాల్లోకి వెళితే.. రెడ్డికాలనీలో నివాసం ఉండే నీలం పెద్దరెడ్డయ్య వ్యవసాయం చేసుకుని జీవించేవారు. బుధవారం ఉదయం తన కుమారుడు చిదంబరంతో కలిసి సొంత పని మీద ప్రొద్దుటూరుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇల్లు చేరుకున్నారు. ఇంటిపైన ఉన్న గదిలోని బీరువాలో బంగారం దాచుకున్నారు. అప్పటి వరకు కింది ఇంట్లో ఆయన భార్య మాత్రమే ఉన్నారు. ఆమె కూడా ఇంట్లో వంట చేసుకుంటుండగా దుండగులు ఇంటి పైకి వెళ్లి అక్కడే ఉన్న బీరువా బీగాలతో తెరిచి అందులో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలను అపహరించారన్నారు. బుధవారం రాత్రి పెద్దరెడ్డయ్య భార్య బీరువా తాళాలు తెరిచి ఉండడం గమనించి తెరిచి చూడగా బంగారు ఆభరణాలు కనబడకపోవడంతో భర్త, కుమారుడికి తెలిపిందన్నారు. వ్యవసాయం చేసి తినీతినక రూపాయి రూపాయి కూడబెట్టుకుని సంపాధించుకున్న బంగారు ఆభరణాలు అపహరించడంతో ఆందోళన చెందారు. బంగారు ఆభరణాలు సుమారు రూ.26లక్షల విలువ ఉంటుందని బాధితులు వాపోయారు. దీంతో పోలీసులను ఆశ్రయించడంతో బుధవారం రాత్రి, గురువారం కూడా ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దనపాడులో చోరీ

ఎర్రగుంట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం పెద్దనపాడు గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... పెద్దనపాడు గ్రామానికి చెందిన బోరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అదే గ్రామంలో ఉన్న తన బంధువుల ఇంటికి మధ్యాహ్న సమయంలో ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఇంటికొచ్చి చూసుకునేసరికి వాకిలి తాళం పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు తెలిపాడు. ఒకటిన్నర తులం బంగారు గొలుసు, ఒక ఉంగరం, జత కమ్మలు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రీసర్వే సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రెవెన్యూ, అటవీ భూములకు హద్దులు ఏర్పాటు
- సర్వేలో పాల్గొన్న రాజంపేట సబ్ కలెక్టర్, మదనపల్లి సబ్ డీఎఫ్‌వో

సుండుపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సమయంలో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రాజంపేట సబ్ కలెక్టర్ భావన తెలిపారు. గురువారం మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ గోపాలకృష్ణపురం సమీపంలోని రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు రాళ్లను అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా గుర్తించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ భావన, మదనపల్లె సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు మాట్లాడుతూ పింఛా ప్రాజెక్టు నిర్మించే సమయంలో సమీప ప్రాంతంలో ఉన్న గొందిపల్లెను ఖాళీ చేయించి వారికి అటవీ శాఖకు సంబంధించిన 400 ఎకరాల భూమిని కేటాయించడంతో అక్కడ ఇళ్లు కట్టుకున్నారని తెలిపారు. అయితే ఆరు నెలల క్రితం జరిగిన రీసర్వేలో ఆ ఊరు, ఆ ఊరి రైతులకు సంబంధించిన భూములు రికార్డుల్లో ఇంకా అటవీ భూమిగానే ఉండడంతో ఆ సమస్య పరిష్కారానికి సరిహద్దు రాళ్లను గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం ఆ 400 ఎకరాలు ఊరితో పాటు రైతులు పొలాలు, తోటలు ముడుంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో రీసర్వేలో చూపించడం లేదు. సమస్య పరిష్కరించడానికి సంయుక్తంగా సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు కోసం ఉన్న ఊరిని, పట్టా భూములను వదిలేసి వచ్చాము. సుమారు 50 సంవత్సరాలుగా ఆర్ఎస్ఆర్‌లో ఇంకా అటవీ భూమిగానే మా ఊరు, పొలాలు ఉండడం బాధాకరమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కల్లే రెడ్డెప్ప అధికారులను కోరారు. అప్పట్లో ప్రాజెక్టు నిర్మించే సమయంలో కలెక్టర్‌గా పనిచేసిన గోపాలకృష్ణ పేరును ఆ ఊరికి గోపాలకృష్ణాపురంగా మా ఊరి పెద్దలు పెట్టారని అధికారులకు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏడీ భరత్, జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రాజంపేట డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గురవయ్య, సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, మండల సర్వేయర్ సులోచన, వీఆర్‌వో హరీశ్, గ్రామ సర్వేయర్ సలీం తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ భావన, అధికారులు

కిచెన్ షెడ్ నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- డీఈవో షంషుద్దీన్


సింహాద్రిపురంలో సెంట్రల్ కిచెన్ షెడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్, అధికారులు

సింహాద్రిపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ కిచెన్ షెడ్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ తెలిపారు. గురువారం సింహాద్రిపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో జరుగుతున్న సెంట్రల్ కిచెన్ షెడ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్ నిర్మాణ పనులు పూర్తి కాగానే మండలవ్యాప్తంగా అన్ని పాఠశాలలకు ఒకే రకమైన మధ్యాహ్న భోజనం ఇక్కడ నుంచే మెనూ ప్రకారం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పాత జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో నూతనంగా నిర్మించిన మోడల్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 ఖాదర్‌బాషా, ఎంఈవో-2 శారద, హెచ్‌ఎం సతీష్‌కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి


బ్యాండ్ షో నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, కళాజాగృతి బృందం

కడప క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం నగరంలోని మహిళా పోలీసుస్టేషన్ వద్ద అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలు, సేవలు ప్రజలకు తెలిసేలా పోలీసులు బ్యాండ్ షో నిర్వహించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో ఎంపికైన క్రీడాకారులు ఏలూరులో ఈనెల 22, 23లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మెడల్ సాధించినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి గౌస్‌బాషా తెలిపారు. ఇందులో 800మీటర్లు, 400మీటర్లు, 400 ఇంటు 4 మీటర్ల రిలే పోటీల్లో జిల్లాకు చెందిన సాయి రెండు సిల్వర్, ఒక బంగారు పతకం, అలాగే 1500 మీటర్లు, 400 ఇంటు 4రిలేలో కాంస్య, బంగారు పతకాన్ని ఎ.సాయిప్రశాంత్ సాధించారన్నారు. నవంబరు 27 నుండి 30 వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని తెలిపారు.

గండికోట నుంచి మైలవరానికి 4000 క్యూసెక్కుల నీరు విడుదల

కొండాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి గురువారం రాత్రి నుంచి 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 4500 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయర్ నుంచి పెన్నానది ద్వారా 500 క్యూసెక్కులు, సీబీఆర్ నుంచి వరద నీరు మరో 1000 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.45 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు.

భాగవతులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి

- కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

పులివెందుల రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భాగవత సప్తాహంలో పాల్గొంటున్న భాగవతులకు ప్రభుత్వం కళాకారుల పింఛన్ సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామంలో ఉన్న కోదండరామాలయంలో భాగవత సప్తాహ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తులసిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక మానవునికి ప్రశాంతిని కలిగించే నిలయాలు ఆధ్యాత్మిక క్షేత్రాలన్నారు. పురాణ ఇతిహాసాలైన రామాయణం, మహాభారతం, మహాభాగవతం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని, నిత్యచైతన్య దిక్సూచికలని ఆయన అన్నారు. నిరంతరం అనేకమంది భాగవతులు భాగవత సప్తాహం కార్యక్రమంలో పాల్గొంటూ ఆధ్యాత్మిక భావాలను, ప్రశాంతి కిరణాలను సమాజంలో ప్రసరింపజేస్తున్నారని, వీరికి కళాకారుల పింఛన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగవతులు పుల్లారెడ్డి, యాగంటి బాలకృష్ణారెడ్డి, నాగసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు సీఐ సీతారామిరెడ్డి..?

- హోంగార్డును దూషించి కొట్టడమే కారణమా..?

పులివెందుల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అర్బన్ సీఐ సీతారామిరెడ్డిని వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం కదిరి రోడ్డులో పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. అందులో హోంగార్డు నాయక్ కూడా ఉన్నారు. అరెస్టు చేసి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన సమయంలో సీతారామిరెడ్డి విచక్షణారహితంగా నాయక్‌ను కులం పేరుతో దూషిస్తూ కొట్టినట్లు తెలిసింది. దీంతో నాయక్ ఎస్పీకి ఫిర్యాదు చేయగా ఎస్పీ బుధవారం ఇరువురినీ కడపలోని తన కార్యాలయానికి పిలిపించుకుని విచారించారు. ఈ విషయమై సీతారామిరెడ్డిని వీఆర్‌కు పంపినట్లు పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నాయి. దీనిపై ఇంకా అధికార ప్రకటన వెలువడలేదు.

విద్యార్థులకు అసౌకర్యం లేకుండా పరీక్షలు

- కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీఈడీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు సూచించారు. యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలను తనిఖీ చేశారు. గురువారం కడప నగరం ఎస్వీ డిగ్రీ కళాశాల, శ్రీహరి డిగ్రీ కళాశాల, విజయలక్ష్మి బీఈడీ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు జిల్లాల్లో జరుగుతున్న పరీక్షలకు సెంటర్ అబ్జర్వర్లతోపాటు, ప్రతిరోజు స్క్వాడ్ బృందాలను పంపుతున్నామని తెలిపారు. ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా కేంద్రాల సూపరింటెండెంట్లకు సూచించారు.

అనుమతులు లేని నూనె కేంద్రం సీజ్

సీకేదిన్నె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా జంతుమాంసం వ్యర్థాలతో తయారు చేస్తున్న నూనె కేంద్రాన్ని గురువారం సీజ్ చేసినట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఆజాద్ నగర్‌కు చెందిన షేర్ నూర్ మహమ్మద్ చింతకొమ్మదిన్నె మండలంలోని చెర్లోపల్లె కాలనీలో ఉన్న ఓ ఇంటిలో ఎలాంటి అనుమతులు లేకుండా జంతుమాంస వ్యర్థాలు ఉపయోగించి నూనె తయారు చేసి ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఫెర్టిలైజర్స్ కంపెనీలకు అమ్ముతున్నట్లు స్థానికుల ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు గురువారం దాడి చేసి నూనె తయారు చేస్తున్న షేక్ నూర్ మహమ్మద్‌ను, నూనె డబ్బాలు, ముడి సరుకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మైదుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి ప్రకాశ్‌నగర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. రాజుపాలెం గ్రామానికి చెందిన దాసరి జయరాములు, ఆయన భార్య దాసరి నాగమునెమ్మ ద్విచక్ర వాహనంలో బ్రహ్మంగారిమఠానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ప్రకాశ్‌నగర్ వద్ద జాతీయరహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడి గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారిని ఆసుపత్రికి తరలించారు.

దర్గా ఉరుసు ఉత్సవాలకు 40 బస్తాల బియ్యం వితరణ



బియ్యం బస్తాలు అందిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. గోవర్ధనరెడ్డి

కడప మారుతీనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 4 నుంచి 9 వరకు జరగనున్న పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాల మహోత్సవాలను పురస్కరించుకుని వచ్చే భక్తుల సౌకర్యార్థం వారికి భోజన వసతి కల్పించేందుకు 40 బస్తాల బియ్యం వితరణ చేసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. గోవర్ధనరెడ్డి వెల్లడించారు. ఆ మేరకు గురువారం స్థానిక పెద్ద దర్గా వద్దకు 40 బస్తాలు బియ్యం తీసుకెళ్లి దర్గాప్రతినిధులకు అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలోకువైత్ ఎన్ఆర్ఐ ఉపాధ్యక్షుడు షేక్ రహంతుల్లా, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాసాపేట శివ, నగర అధ్యక్షుడు అనిల్, కడప పార్లమెంటు ఉపాధ్యక్షుడు లోకేశ్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, ఆవుల వెంకటేశ్; కిరణ్ పాల్గొన్నారు.

అవినీతి జరగకుండా నిరోధించాలి

చెన్నూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఏ స్థాయిలో ఉన్నా దానిని జరగకుండా నిరోధించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు డీఈ ఈశ్వరయ్య అన్నారు. ఎంపీడీవో సభాభవనంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఎసమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతి విషయంలో మొదట్లోనే దానిని ఆపాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ నాయకుల నారాయణ, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, డిప్యూటీ తహసీల్దారు వెంకటరమణ, ఏఎస్ఐ శంకర్‌నాయక్, ఎఫ్ఆర్‌వో మురళీక్రిష్ణ పాల్గొన్నారు.



చంద్రబాబు పరిపాలనా దక్షుడు



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపత్తు వచ్చినపుడు ముందస్తుగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ,ప్రజలకు నేనున్నానని ధైర్యం చెప్పే పరిపాలనదక్షుడు చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు.గురువారం ద్వారకానగర్ తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుఫాన్ బాధితులను పరామర్శించడానికి విమానం లేదని చెప్పి ముఖం చాటేశారని తీవ్రంగా విమర్శించారు. తుఫాన్‌పై వైసీపీ నేతలు ఫేక్ ప్రచారాలతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రామకృష్ణమఠం సమీపంలోని పది ఎకరాల భూమిలో ఐటీ పార్క్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, ఉక్కాయపల్లెలో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కూడా చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, పరిపాలనలో ప్రజలకు నమ్మకం కలిగించే పాలన చంద్రబాబు ప్రత్యేకతగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, 8వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అండ్లూరి బాలకృష్ణారెడ్డి, కార్పొరేటర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అనాథలకు అన్నదానం చేస్తున్న శ్రీనివాసులు అనుచరులు

వేంపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె గండిరోడ్డులోని నాగమ్మనగర్ అనాథశరణాలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వేంపల్లె సర్పంచు ఆర్.శ్రీనివాసులు పుట్టినరోజుజు సందర్భంగా ఆయన అనుచరుడు పుల్లయ్యతోటకు చెందిన నాగేష్ అనాథలకు అన్నదానం చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. కుప్పాలపల్లెకు చెందిన దివాకర్‌రెడ్డి అయ్యప్పస్వామి భక్తులకు భిక్ష ఏర్పాటుచేశారు. అనుచరులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.వేణు, కసిరెడ్డి ఆది, భూషణం, బ్రహ్మా, సునీల్, హరి, శివ, పవన్, లోకేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి చెత్తను సేకరించాలి



వేంపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించాలని ఈఓ నాగభూషణంరెడ్డి తెలిపారు. వేంపల్లెలోని చెత్త సంపద తయారీ కేంద్రం ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించేందుకు ఆటోలు, ట్రాక్టర్లు ట్రైసైకిళ్లను పూర్తిస్థాయిలో నియమించినట్లు తెలిపారు. ఎక్కడైన చెత్తసేకరణకు వాహనాలు రాకుంటే పంచాయతీ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెత్త సంపద కేంద్రం ఇన్‌చార్జివలి,పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్యం విస్మరించిన వైసీపీ

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి



కడప మారుతీనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్భాటపు కోడికి అరుపులెక్కువ అన్నట్లుగా.. తమ ఐదేళ్ల పాలనతో 17 వైద్యకళాశాలలు ఏర్పాటు చేశామంటూ నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి డబ్బా కొట్టుకోవడం తప్ప.. వాటిని అసంపూర్తిగా మిగిల్చామనే నగ్నసత్యాన్ని విస్మరించారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 వైద్యకళాశాలల్లో కేవలం ఒక పులివెందుల వైద్యకళాశాల 90 శాతం మేర పూర్తి చేశారని మిగలిన 16 కళాశాలలలో ఐదు వాటిల్లో మాత్రమే తరగతులు ప్రారంభమయ్యాయని అన్నారు. మిగతావన్నీ అసంపూర్తిగానే వదిలేశారని విమర్శించారు. కాగా అసంపూర్తిగా ఉన్న కళాశాలలను త్వరితగతిన పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం తీసుకు వచ్చిందన్నారు. పీపీపీ పద్ధతిలో వైద్యకళాశాలలు పూర్తయిన తరువాత దాదాపు 70శాతం వాటిల్లోని పడకలు ఎన్టీఆర్ వైద్యసేవకు కేటాయిస్తారన్నారు. పేదలకు వైద్యం మరింతగా అందుతుందన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో ఆర్థిక తోడ్పాటు

ప్రొద్దుటూరు , అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని ఆదు కోవడాని ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదం చేస్తున్నదని ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. గురువా రం స్థానిక టీడీపీ కార్యాలయంలో 73 మందికి రూ. 48,22,228 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ చికిత్సలు చేయించుకొని ఆర్థికంగా దెబ్బ తినకుండా ప్రభుత్వం తన వంతు సహకారాలను అందిస్తోంద న్నారు. కార్యక్రమంలో టీడీపీ 32 వవార్డు ఇన్‌చార్జ్ మార్తల గురివిరెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

కార్తీక వనభోజన మహోత్సవానికి తరలిరండి

కడప మారుతీనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో 2వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నగర చిన్నచౌక్ రోడ్డులో గల పద్మశాలీ భవన్‌లో తలపెట్టిన కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమానికి జిల్లాలోని పద్మశాలీయ వర్గీయులు వారి కుటుంబాలతో కలిసి తప్పక హాజరుకావాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు పిలుపు నిచ్చారు. ఆ మేరకు గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వనభోజన కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటలకు మహిళలకు ఆటల పోటీలుంటాయన్నారు. అనంతరం 10 గంటల నుంచి శ్రీ భద్రావతి భావనారాయణ స్వాముల కల్యాణ మహోత్సవం, అనంతరం కార్తీక వనభోజన కార్యక్రమం జరుగనుందన్నారు.



వృద్ధులకు అన్నదానం

లింగాల, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పట్ల సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ అనాథ వృద్ధాశ్రమంలో గురువారం లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి పాపిరెడ్డి, అనంతమ్మ దంపతుల కుమార్తె మాధవిలత 16వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక లలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. గురువారం శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి అమ్మవారికి సాయంత్రం మహిళలు కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



పరిసరాల శుభ్రత మన బాధ్యతే



మహిళా చైతన్యంపై తెలియజేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వేంపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతే మన బాధ్యతని ట్రిపుల్ఐటీ అధికారులు సూచించారు. వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ,వీరన్నగట్టుపల్లె, చింతలమడుగుపల్లె గ్రామాల్లో 2,6,7 యూనిట్ల ఆధ్వర్యంలోని వలంటీర్లు గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లో శ్రమదానం చేశారు. పలుచోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. మొక్కలు నాటించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని తెలిపారు. ఏవో రవికుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు రత్నకుమారి, కోనప్ప తదితరులు పాల్గొన్నారు.









రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు మేలు

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ

సుండుపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ తెలిపారు. గురువారం వివిధ పల్లె, రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచుకోవాలన్నారు. రైతు సంఘాల ద్వారా ఎంతో మంది రైతులు ఆర్థికంగా ముందడుగు వేస్తున్నారని తెలియపరిచారు. కలిసికట్టుగా ఉంటే బ్యాంకుల ద్వారా లోను పొందవచ్చని తెలియజేశారు. అనంతరం మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎఫ్‌పీవో లైసెన్సుల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి అధికారి విజయవిహారి, మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, వ్యవసాయ కేంద్రం స్టేట్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, న్యాచురల్ ఫ్యామిలీ కోఆర్డినేటర్ అనూష, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

● డీపీవో రాధమ్మ



మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాలు అపరిశుభ్రంగా ఉండేలా చోట్ల పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లాలోని పంచాయతీ అధికారులను డీపీవో రాధమ్మ ఆదేశించారు. గ్రామాల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవడం, ఫాగింగ్ స్ప్రేయింగ్ చేసి దోమలను నివారించడం వంటి చర్యలు చేపట్టాలని వారు పేర్కొన్నారు. ప్రతిరోజు నాణ్యతతో కలిగిన బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ చేయడం తప్పకుండా పాటించాలన్నారు. డ్రైనేజీలో పూడికను, చెత్తను ఇళ్ల మధ్యలో వేయకుండా దూరప్రాంతాలకు వెళ్లి నిలువ చేయడంతో పాటు కిరోసిన్‌తో పాటు క్రిమిసంహారక స్ప్రేలు చేయాలని ఆమె సూచించారు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌పీవోలు, పంచాయతీ అధికారులకు ఆమె సూచించారు.

తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



మస్తాన్, ధనుష్‌లను అభినందిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో ఈ నెల 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో రైల్వేకోడూరు విద్యార్థులు ప్రతిభ చూపినట్లు గురువారం గురుదేవ వశిష్ట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్రజున్ను రమేష్ తెలిపారు. తమ విద్యార్థి మస్తాన్ వెండి పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అలాగే ఆదర్శ విద్యాలయం విద్యార్థి ధనుష్ తైక్వాండో పోటీల్లో విశేషంగా ప్రతిభను కనబరిచి వెండి పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపాల్ కంచిరాజు చంగల్‌రాజు తెలిపారు. ఇద్దరు విద్యార్థులను యాజమాన్యాలు అభినందించాయి. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్ ఎస్‌కే మౌలా పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

ఒంటిమిట్ట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి నాగరాజు తనిఖీ చేశారు. గురువారం ఉదయం పీహెచ్‌సీని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఒంటిమిట్టలోని ఉన్నత పాఠశాలలో నీటిశుద్ధి ప్లాంటును, మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ నిర్వహించారు. పీహెచ్‌సీలోని రోగులను పరామర్శించి వైద్యాధికారికి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ప్రవీణ్‌కుమార్, మండల వైద్యాధికారి భావన, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రకుమార్, ఐడీఎస్పీ ఖాజా, ఆర్‌బీఎస్‌కే జిల్లా మేనేజర్ రమేష్, సూపర్‌వైజర్లు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనరసమ్మ, ఏఎన్‌ఎంలు నాగభూషణమ్మ, నాగమణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి'

పీలేరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తున్న నేపథ్యంలో పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ గురువారం సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ నడిమికండ్రి సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల హామీని నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం దశాబ్దాలుగా పీలేరుకు జరుగుతున్న అన్యాయాన్ని కూడా సవరించాలన్నారు. పీలేరు పట్టణం భౌగోళికంగా, స్వతహాగా అభివృద్ధి చెందిందే తప్ప చెప్పుకోదగ్గ ప్రభుత్వ సంస్థలు లేవన్నారు. అంతే కాకుండా పీలేరు నుంచి 58 కి.మీ. దూరంలో ఉన్న మదనపల్లెకు వెళ్లాలంటే పీలేరుతో పాటు పరిసర మండలాలైన కేవీపల్లె, కలికిరి, కలకడ, పులిచెర్ల, సదుం, రొంపిచెర్ల ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. దాదాపు 12 మండలాలు, 200 గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉన్న పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాసులు, భానుప్రకాశ్, చంద్రయ్య, ధరణీకుమార్, శ్రీకాంత్, నరేశ్, ఆంజనేయులు, కొండయ్య, తిమ్మయ్య, ప్రసాద్, వెంకటేశ్, అంజి, జెట్టి మల్లిఖార్జున పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి భాస్కర్, క్లస్టర్ అధికారి ఆనంద్ అన్నారు. గురువారం మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, వాయల్పాడు క్లస్టర్ల నుంచి కౌన్సిలర్లు పాల్గొన్నారు. మదనపల్లె ఏఆర్టీ సెంటర్, ఆర్ఆర్ఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ఐసీటీసీ, డీఎస్ఆర్సీ, ఏఆర్టీ, టీఐ సిబ్బందితో సమీక్షించారు. అన్ని విభాగాల నెలవారి నివేదికను పరిశీలించారు. వ్యత్యాసాలుంటే ఇంప్రూవ్ చేసుకోవాలన్నారు. పాజిటివ్ ఉన్నవాళ్లు మెరుగైన సేవలను అందించాలన్నారు. కార్యాలయాల్లో రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ మేఘన, టీఐ మేనేజర్లు, ఆర్ఆర్ఎస్, కృషి, జనచేతన సిబ్బంది పాల్గొన్నారు.

వర్షమొస్తే...

● నీటిమడుగుల్లా వీధి రోడ్లు ● పట్టించుకోని పాలకులు

గుండాలపల్లె మునకే...



వర్షపు నీటిలో అవస్థలు పడుతున్న మహిళ

రైల్వేకోడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షమొస్తే చాలు గుండాలపల్లె గ్రామం జలదిగ్భంధంలో ఉంటుంది. ఆ వీధి రోడ్లు మొత్తం జలమయమై వాహ నదారులకు ఇబ్బందిగా ఉంటోంది. కొన్నేళ్లుగా అండర్ డ్రైనేజి కోసం విన్నవించినా పాలకులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని గుండాలపల్లె గ్రామంలో సుమారు పది వీధి రోడ్లు ఉన్నాయి. సిమెంట్ రోడ్లు ఉన్నా వర్షం వచ్చినప్పుడు వర్షపు నీరు వెళ్లేందుకు దారి లేదు. దీంతో ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు గుండాలపల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత శనివారం కురిసిన భారీ వర్షానికి వీధులు మొత్తం జలమయమయ్యాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుండాలపల్లెలో వెలసిన సిమెంట్ రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో గతంలో ప్రజలందరూ అధికారులు, పాలకులకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టి అండర్ డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయాలని విన్నవించారు. అయినా ఇంతవరకు పాలకులు గుండాలపల్లెను పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



గుండాలపల్లెలోని జలమయమైన వీధి

గుండాలపల్లె చీనీ, నిమ్మ అంటు మొక్కలకు ప్రసిద్ధి. ఇక్కడి నుంచి తెలంగాణ రాష్ట్రానికి లక్షలాది మొక్కలను వ్యాపారులు ఎగుమతి చేస్తారు. ఈ మొక్కలే కాకుండా మామిడి, సపోటా, కొబ్బరి మొక్కలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. గుండాలపల్లెలో వ్యాపారులు సుమారు వందేళ్ల నుంచి ఈ వ్యాపారం పైనే జీవనం సాగిస్తున్నారు. గత కాంగ్రెస్ హయాంలో సిమెంటు రోడ్లకు నోచుకుంది. అయితే అండర్ డ్రైనేజి సిస్టం అప్పుడు లేదు. రానురానూ ప్రతి చోట అండర్ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. గుండాలపల్లె వాసులు చాలా కాలంగా అండర్ డ్రైనేజి వ్యవస్థతో పాటు కొత్తగా సిమెంట్ రోడ్లు వేయాలని డిమాండు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుండాలపల్లె గ్రామంలో 300 కుటుంబాలు ఉన్నాయి. జనాభా 1800 మంది ఉన్నారు. ఓటర్లు 890 ఉన్నారు. ఇప్పటికైనా పాలకులు గుండాలపల్లె పై కరుణ చూపి సిమెంట్ రోడ్లతో పాటు అండర్ డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



గుండాలపల్లె మొత్తం అండర్ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయాలి. వర్షం వస్తే వీధుల్లో తిరగలేకున్నాం. గతంలో వేసిన సిమెంట్ రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున ప్రతి వీధిలోనూ నీరు చేరుతోంది. దీంతో దోమలు ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలి.

\- ఆంజనేయులుబాబు, గుండాలపల్లె, గ్రామస్థుడు

పాలకులకు విన్నవించినా ప్రయోజనం లేదు



గ్రామంలోని సమస్యలను పాలకులకు విన్నవించినా ప్రయోజనం శూన్యం. సిమెంట్ రోడ్లతో పాటు అండర్ డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరాం. చాలా సార్లు విన్నవించాం. ఇంతవరకు ఎవరూ పట్టించుకున్న పాపనపోలేదు. గ్రామంలో ప్రజలు వర్షం వస్తే తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

\- పగడాల విశ్వనాథ, గుండాలపల్లె గ్రామస్థుడు

మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవీ కాలం పెంచాలి

● కమిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి ● ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన జిల్లాలోని చైర్మన్లు



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్లు

పీలేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఏడాది మాత్రమే ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవీ కాలాన్ని మూడేళ్లకు పెంచాలని జిల్లాలోని మార్కెట్ కమిటీల చైర్మన్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం పీలేరు, రాయచోటి, మదనపల్లె, లక్కిరెడ్డిపల్లె, వాల్మీకిపురం, కలికిరి కమిటీల చైర్మన్లు పురం రామ్మూర్తి, రాంప్రసాద్ రెడ్డి, శివరామ్ రాయల్, షఫీ నాయక్, చంద్రమౌళి, మాలతి పీలేరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ఏడాది మాత్రమే ఉండడంతో మార్కెట్ కమిటీల విధివిధానాలు, నిబంధనలు అర్థం చేసుకోవడానికే సమయం సరిపోతోందని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నామని వాపోయారు. గతంలో ఉన్న మాదిరిగా తమ పదవీ కాలాన్ని మూడేళ్లకు పెంచాలని వారు కోరారు. కేవలం రాజకీయ అవసరాల కోసమే గత వైసీపీ ప్రభుత్వం ఏడాది పదవీ కాలాన్ని తీసుకువచ్చిందన్నారు. వైసీపీ పాలనలో మార్కెట్ కమిటీలకు సంబంధించిన జీవోలన్నింటినీ రద్దు చేయాలన్నారు. తమకు గౌరవ వేతనంగా కూడా చాలా నామమాత్రంగా ఉందని, తమకు వాహన సౌకర్యం కల్పించడంతో పాటు రూ.50 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. జిల్లాలోని 10 మార్కెట్ కమిటీలలో 175 మంది పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 25 మంది మాత్రమే పనిచేస్తున్నారని, మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో నైనా భర్తీ చేసుకునే వెసులుబాటు కమిటీలకు కల్పించాలన్నారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు త్వరలోనే రాయలసీమ జిల్లాల్లోని చైర్మన్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో వివిధ కమిటీల డైరెక్టర్లు గోళ్ల కిశోర్ నాయుడు, లక్ష్మీపతి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● తనిఖీ బృందం అధికారి వెంకటేశ్వరనాయుడు



రికార్డులను తనిఖీ చేస్తున్న తనిఖీ బృందం అధికారులు

తంబళ్లపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని తనిఖీ బృందం అధికారి వెంకటేశ్వరనాయుడు సూచించారు. గురువారం రాయచోటి, సుండుపల్లె నుంచి వచ్చిన ఏడుగురు సభ్యులతో కూడిన అధికారుల బృందం ఎస్టీ గురుకుల బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, సబ్జెక్టుల వారీ విద్యార్థులకు అందుతున్న బోధన, ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలకు మంజూరైన నిధులు, చేసిన ఖర్చులు, రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీలో తేలిన అంశాలను నివేదిక రూపంలో అధికారులకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అనుమానితుల విచారణ

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలో బూచిపల్లె, మద్దయ్యగారిపల్లె, కుమ్మరవాండ్లపల్లె గ్రామాల్లో జరిగిన చోరీ కేసులో నలుగురు అనుమానితులను పీటీఎం పోలీసుస్టేషన్‌లో విచారిస్తున్నట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... మండలంలో ఇటీవల బూచిపల్లె, మద్దయ్యగారిపల్లె, కుమ్మరవాండ్లపల్లె గ్రామాలలో చోరీ కేసులు నమోదయ్యాయని వీటిపై విచారణ నిమిత్తం కర్నూలు జిల్లా పాణ్యంకు చెందిన అంకన్న(25), సత్యహరిశ్చంద్ర(32), చిన్నహుస్సేన్(45), దాసరిజమ్ములు(40) దొంగతనం కేసులో నిందితులుగా ఉన్నారని, విచారణ నిమిత్తం అనుమానితులు తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మిద్దె మెట్లపై నుంచి పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని చౌడసముద్రంకు చెందిన కె.శేషాద్రి(21) మిద్దెపైకి వెళ్లి మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకుడ్ని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించారు.

నూతన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీలు ఇవ్వాలి

● అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు

రాయచోటిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియామకం పొందిన ఉపాధ్యాయులకు వెంటనే ట్రెజరీ ఐడీలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) జిల్లా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం ఆపస్ కార్యాలయంలో రాయచోటి డివిజన్‌శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006 డీఎస్సీలో నియామకం పొందిన ఉపాధ్యాయులకు వెంటనే ట్రెజరీ ఐడీలు క్రియేట్ చేసి వారి జీతభత్యాలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల కాలంలో బదిలీ పొంది రిలీవ్ కానటువంటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారికి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అపస్ రాష్ట్ర నాయకుడు భూషణయ్య, జిల్లా సహాధ్యక్షుడు నాగేంద్ర బాబు, జిల్లా కార్యదర్శి బాలాజీ, అపస్ నాయకులు మల్లికార్జున, నాగేంద్రప్రసాద్, రాజా, మనోహర్‌బాబు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల గదుల పరిశీలన



గదులను సందర్శించేందుకు వచ్చిన జిల్లా అధికారులు

చిట్వేలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన చిట్వేలిలోని పరీక్ష కేంద్రాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ రవి, ఉపాధ్యాయులు ఆదినారాయణరెడ్డి, మండల విద్యాశాఖాధికారులు ఖాజామొహిద్దీన్, ఈశ్వరయ్యలు పరిశీలించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు దుర్గరాజుతో కలిసి గదుల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా పరిణామాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, ఖాలేషా మహేశ్వర, వెంకటసుబ్బయ్య, సతీష్, సీఆర్ఎం టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు ఎస్ఐ.. వీఆర్‌కు

కురబలకోట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు పోలీసుస్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్‌ను వీఆర్‌కు పంపుతూ డీఐజీ కోయప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రభుత్వం కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 14 మంది ఎస్ఐలను బదిలీ చేసింది. ఇందులో భాగంగా ముదివేడు ఎస్ఐగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్‌ను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్‌లో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



త్రివేణి (ఫైల్ ఫొటో)

పీలేరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి పీలేరు పట్టణం మోడల్ కాలనీకి చెందిన త్రివేణి(25) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. మోడల్ కాలనీకి చెందిన త్రివేణికి, కేవీపల్లె మండలం గోరంట్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యంతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. గత కొంతకాలంగా వారిద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. తన ఇద్దరు పిల్లలతో త్రివేణి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆమె పురుగుల మందు సేవించి ఇంట్లో నిద్రించింది. ఆమె నోట్లో నుంచి నురుగు రావడం గమనించిన కుటుంబసభ్యులు ఆమెను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దమండ్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి విషద్రావణం తాగి కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... మండలంలోని సి.గొల్లపల్లి పంచాయతీ రెక్కలకొండపల్లికు చెందిన నాగరాజ(47) మేస్త్రి పనులకు వెళుతుండేవాడు. జీవనోపాధి నిమిత్తం ఆయన భార్య సుభద్ర కువైత్‌కు వెళ్లింది. కొంతకాలంగా భర్త నాగరాజ మద్యానికి బానిసయ్యాడని తెలుసుకున్న భార్య రెండేళ్ల కిందట తిరిగి స్వగ్రామానికి వచ్చేసింది. మద్యం తాగేందుకు తరుచూ డబ్బుల కోసం ఇంట్లో వేధించేవాడు. ఈ నెల 25వ తేదీ మద్యానికి డబ్బు ఇవ్వలేదని నాగరాజ విషద్రావణం సేవించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని రాయచోటికి తరలించగా.. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు మృతుడి కుమారుడు జగదీష్ పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు



గాయపడిన వృద్ధుడు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు పుంగనూరు రోడ్డులోని చంద్రమాకులపల్లెకు చెందిన వెంకటప్ప పనిపై మదన పల్లెకు వచ్చాడు. టౌన్‌బ్యాంకు సర్కిల్‌లో రోడ్డు దాటుతుండగా పుంగనూరు నుంచి మదనపల్లె వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. వృద్ధుడికి ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయాయి. గమనించిన స్థానికులు వృద్ధుడిని వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. ఇతనికి భార్య మంగమ్మ, ఆర్టీసీలో ఉద్యోగం చేసే ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు టూటౌన్ ఎస్ఐ రామాంజ నేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

● రికార్డులు పరిశీలించిన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో వెబ్‌ల్యాండ్ ఫైల్స్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తనిఖీ చేశారు. రామసముద్రం, మదనపల్లె, నిమ్మనపల్లి, కురబలకోట, బి.కొత్తకోట, పీటీఎం తహసీల్దార్లు, వీర్వోలతో సమావేశమైన జేసీ మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ పరిశీలించారు. ఫైల్స్‌పై విడివిడిగా రికార్డులు తనిఖీ చేశారు. వెంటనే పెండింగ్ వెబ్‌ల్యాండ్ ఫైల్స్‌ను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మదనపల్లె తహసీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి, నిమ్మనపల్లె తహసీల్దార్ తేజశ్వని, బి.కొత్తకోట తహసీల్దార్ బావాజాన్, ములకలచెరువు, పీటీఎం తహసీల్దార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కుందూ వరదతో పంటలకు నష్టం

● ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ ● నీటమునిగిన వరి, విద్యుత్తు మోటార్లు ● పలుగ్రామాలకు రాకపోకలు బంద్

దువ్వూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టినా కుందూలో వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో కుందూ పరివాహక ప్రాంతాల్లో వరి పంటతోపాటు వ్యవసాయ విద్యుత్ మోటార్లు నీటమునిగిపోయి రైతన్నలకు తీవ్రనష్టం కలిగించాయి. పెద్దజొన్నవరం రైతులకు చెందిన 40 విద్యుత్ మోటార్లతోపాటు వరి పొలాలు నీటిలో మునిగిపోయాయి. నేలటూరు, జిల్లేళ్ల పరిధిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మోటార్లు మునిగిపోవడంతో రూ.25 వేల నుంచి రూ.30 వేల దాకా నష్టపోతున్నామని రైతన్నలు వాపోతున్నారు. కానగూడూరులో సైతం పొలాల్లోకి నీరు చేరింది. రాజోలి ఆనకట్ట వద్ద గురువారం 40 వేల క్యూసెక్కులకుపైగా చేరుకుందని అధికారులు తెలిపారు. ప్రవాహ పెరుగుదలతో పొలాలమీదకు నీరు చేరుతుండడంతో రైతులను ఆందోళన పరుస్తోంది.


దువ్వూరు మండలం పెద్దజొన్నవరంలో సమీప పొలాల్లో నీట మునిగిన మోటార్లు


రాజోలి ఆనకట్ట వద్ద పరవళ్లు తొక్కుతున్న కుందూ


రాజుపాలెం వద్ద టంగుటూరు సమీపంలో కుందూ వరదతో నీటమునిగిన వరి పంట

కేసీని పరిశీలించిన ప్రాజెక్టు వైస్‌చైర్మన్

వరదనీరు భారీగా రావడంతో కేసీ కాలువ అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రవాహం అంచెలంచెలుగా పరిసర గ్రామాలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కాగా వక్కిలేరు వద్ద దెబ్బతిన్న కేసీ కాలువను ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ గురివిరెడ్డి పరిశీలించారు. ఆ ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని కేసీ అధికారులకు సూచించారు. అనంతరం రాజోలి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి పరిస్థితులను తెలుసుకున్నారు. దువ్వూరు, ఖాజీపేట డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు కోనేటి హరినాద్, రవీంద్రారెడ్డి, జేఈలు పవన్‌కుమార్‌రెడ్డి, జమాల్ వల్లి, గురుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజుపాలెంలో: కర్నూలు, నంద్యాల జిల్లాలోని ఓర్వకల్లు, బండి ఆత్మకూరు, నంద్యాలలో భారీ వర్షాలతో కుందూకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. రాజోలి ఆనకట్ట వద్ద వరద నీరు క్రమేణా పెరుగుతూ 40,250 క్యూసెక్కులకు చేరిం దని ఏఈ జమాల్‌వలి అన్నారు. తరువాత టంగుటూరు వద్ద నంద్యాలజిల్లా వక్కిలేరు కలవడంతో కుందూలో 40వేల క్యూసెక్కులకు పైగా నీరు ప్రవహిస్తుంది. దీంతో కుందూకు ఇరుపక్కలా వరి, పూలతోటలు పసుపు, మొక్కజొన్న కొంత మేర నీట మునిగాయి. దద్దనాల, కొట్టాల, కూలూరు, టంగుటూరు, వెలివలి గ్రామాల్లో వరద నీరు ఊరి చుట్టూ ఆవరించాయి. అయితే అధికారులు గ్రామాల్లో రాత్రి నుంచి ప్రజలను అప్రమత్తం చేశారు. కుందూలో భారీగా వరద వస్తుండడంతో పంటలు విద్యుత్ మోటర్లు, కరెంటు లైన్లు దెబ్బతిని నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

పెద్దముడియం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో కుందూ నది పెద్దముడియం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నెమళ్లదిన్నె వంతెన వద్ద సుమారు 3 అడుగుల మేర కుందూ ఉరకలు వేస్తుండడంతో కుందూ అవతలి గ్రామాలైన బలపనగూడూరు, ఉప్పలూరు, .జె.కొత్తపల్లె, జంగాలపల్లెగ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిపోయాయి, అలాగే చిదిపిరాళ్లపల్లె గ్రామం వైపు నుంచి చిన్నముడియం గ్రామానికి కూడా రాకపోకలు ఆగిపోయాయి. నదికి సమీపంలో ఉండే పంట పొలాలకు వరద నీరు పెద్ద ఎత్తున చేరింది నదివెంబడి సాగు చేసిన వరి పొలాల్లో వరద నీరు చేరి పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని రైతులు వాపోతు న్నారు. కుందూ వరద ఉధృతిపై అధికార యం త్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. గత రెండు నెలల నుంచి కుందూ ఉధృతంగా ప్రవహిస్తూ పంట పొలాలకు తీవ్ర నష్టం కలిగిందని, తగు నష్టపరిహారం అందించి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ముంపు గ్రామాల రైతులు కోరుతున్నారు.


దువ్వూరులో దెబ్బతిన్న కేసీ కాలువను పరిశీలిస్తున్న ప్రాజెక్టు వైస్ చైర్మన్ గురివిరెడ్డి

సీఎం సహాయ నిధి ఆర్థిక ఇబ్బందులకు తోడ్పాటు


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేవరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకోవడాని ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదం చేస్తున్నదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 73 మందికి రూ. 48,22,228 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికిత్సలు చేయించుకొని ఆర్థికంగా దెబ్బ తినకుండా ప్రభుత్వం తన వంతు సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. ఈ సిఎం రిలీఫ్ ఫండ్‌ను పారదర్శకంగా అవినీతికి తావులేకుండా బాధితులకు నేరుగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ 32 వవార్డు ఇన్‌చార్జ్ మార్తల గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న పొలాలు

జమ్మలమడుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామం రైల్వే బిడ్జ్ పక్కన వర్షపునీటితో పొలాలు చెరువును తలపిస్తున్నాయి. వర్షం వస్తే ఆ ప్రాంతరైతులకు భారీగా నష్టం ఉంటుందని అన్నదాతలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా వర్షపునీరు నిలుస్తాయన్నారు. గత అయిదు రోజులుగా సంబందిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సమస్య తెలిపినా ఎవరు స్పందించడంలేదన్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు పొలాల్లో ఉన్న నీటిని తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు మహిళలు అందిపుచ్చుకోవాలని వెలుగు ఏపీఎం వెంకటరమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య మహాసభ నిర్వహించారు. అనంతరం మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా రాజేశ్వరి, కార్యదర్శిగా ఉమాదేవి, కోశాధికారిగా సౌజన్యను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని వీవో ప్రతినిధులు, గ్రామ సమాఖ్య సహాయకులు ఏపీఎంలు వెంకటసుబ్బయ్య, నాగేంద్రబాబు, సీసీలు రెహనాబేబీ, షాబీరా, బాలకంబయ్య, ఐయ్యన్న, బ్యాంకు కన్సల్టెన్సీ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు..మద్యం స్వాధీనం

ఖాజీపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రంగాపురానికి చెందిన సుబ్బరాయుడు అక్రమంగా మద్యం అమ్ముతుండగా దాడి చేసి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు. గురువారం సీఐ మాట్లాడుతూ అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా అక్రమ మద్యం అమ్మితే ప్రజలు సమాచారమివ్వాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మైదుకూరులో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

జమ్మలమడుగు/మైదుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జమ్మలమడుగు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో గురువారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఏపీఎస్‌ఆర్‌టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని డిపోలలో నిరాహారదీక్షలు చేపట్టినట్లు తెలిపారు. గత ఆరు నెలలుగా తమ సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తులు చేస్తున్నా స్పందించడంలేదన్నారు. అన్‌కాల్ డ్రైవర్లను తొలగించాలని, నాశిరకం పేపర్ రోల్స్ స్థానంలో నాణ్యమైన పేపర్ రోల్స్ సరఫరా చేయాలని నిబందనలకు విరుద్ధంగా వ్యవహరించిన కడప డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీపీటీవో ఏకపక్ష వైఖరి విడనాడాలన్నారు. దీక్షలో బీవీ స్వామి, నారాయణ, పీఎస్ఎన్ రెడ్డి, మూర్తి, ఎస్ఈ మోహన్, రంగయ్య, ఆరుగురు దీక్షలో కూర్చున్నారు. నిరసన కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ శేషన్న, రీజినల్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. మైదుకూరు డిపోలో ఆర్‌టీసీ ఉద్యోగులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు.

బద్వేలు రూరల్‌లో: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప రీజియన్ ఆదేశాల మేరకు స్థానిక ఎన్ఎంయు కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా డిపో ప్రెసిడెంటు చిన్నపరెడ్డి మాట్లాడుతూ సర్క్యులర్‌కు వ్యతిరేకంగా దూర ప్రాంతాల సర్వీసుకు పంపిస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్లను తొలగించాలన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉద్యో గుల సమస్యలు పరిష్కరించకపోతే రిలేదీక్షలు సాగుతాయన్నారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ చంద్రయ్య, సీపీఎస్ డెలిగేట్ మల్లిఖార్జున, జేవీ రమణ, ఎంఎస్‌రాయుడు, ఆదినారాయణ, హబీబుల్లా పాల్గొన్నారు.

సమాజ స్వచ్ఛతకోసం పాటుపడాలి

ఎర్రగుంట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సమాజ స్వచ్ఛత కోసం పాటుపడాలంటూ పరిశుభ్రమైన గ్రామం-ప్రగతిశీల దేశం అన్న నినాదంతో ఎర్రగుంట్ల ఇంటర్ కాలేజి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో బాగంగా గురువారం క్రాంతినగర్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి స్వచ్ఛభారత్-సుస్థిర భారత్ లక్ష్యంతో ముందుకెళ్లారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ .త్రివిక్రంరెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు శ్రీనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమాజంలో మార్పుకోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు నాగమహేశ్వరరెడ్డి, సంటెప్ప, ఏకోనారాయణ తదితరులు ప్రసంగించారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

జమ్మలమడుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మొంథా తుఫాను వల్ల దెబ్బతిన్న వరి, మినుము పంటలను గురువారం కడప ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. డీఏటీటీ సెంటర్ కడప ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయాధికారులు జమ్మలమడుగు ప్రాంతంలో పర్యటించారు. ప్రధానంగా వర్షానికి వరిపంట నేలవాలి రైతులకు భారీగా నష్టం జరిగింది. దానిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెగుళ్ల విభాగం డాక్టర్లు దానవులపాడు, ధర్మాపురం గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. శాస్త్రవేత్త డాక్టర్ వి.మాధురి, డాక్టర్ యాస్మిన్, ఎన్.క్రిష్ణప్రియ, వ్యవసాయాధికారి నర్రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు నవీన్ కుమార్ వరి, మినుముపంటల్లో ఏర్పడిన నష్టాన్ని పరిశీలించి వరి కంకులు గింజలు మొలకెత్తకుండా లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు వెంటనే పిచికారి చేసుకోవాలని, పాలుపోసుకుని ఉన్న దశలో వరి పైరును నల్లగింజ, పొట్ట కుళ్లు, మానిపండు తెగుళ్లు రాకుండా లీటరు నీటికి ఒక మిల్లీలీటరు ప్రొఫికొనజోల్ మందును పిచికారి చేసుకోవాలని సూచించారు. నీట మునిగిన మినుము పంటను కాపాడుకోవడానికి ముందుగా నిలువ ఉండిన నీటిని బయటకు పంపడంతోపాటు లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల హెక్సాకొనజోల్ మందును పిచికారి చేసుకోవడం వల్ల పంటను రక్షించుకోవచ్చని రైతులకు సూచించారు. భారీగా దెబ్బతిన్న రైతుల రిపోర్టును తయారు చేసి ఉన్నతాధికారులకు తెలుపుతామని వారు తెలిపారు.

పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ముద్దనూరు అక్టోబర్30(ఆంధ్రజ్యోతి):రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల పరిధిలోని రాజులగురువాయపల్లె, తిమ్మాపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన శగన, ప్రొద్దుతిరుగుడు,కంది, మొక్కజొన్న పంటలను గురువారం డాట్ సెంటర్ సమన్వయ కర్త డాక్టర్ క్రిష్ణప్రియ వ్యవసాయ పరిశోధన స్థానం ప్లాంట్ పెథాలజీ శాస్త్రవేత్త మాధురి, సైన్స్ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ యాస్మిన్‌లు పరిశీలించారు. అందులో భాగంగా వర్షాలకు శనగ పంటలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని శాస్త్రవేత్త మాధురి సూచించారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డిరైతులు పాల్గొన్నారు.


చాపాడు వద్ద పడిపోయిన వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు

చాపాడులో: భారీ వర్షానికి నేలకొరిగిన వరి పైరును మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో దేవీ పద్మలత గురువారం పరిశీలించారు. అయ్యవారుపల్లె, తిమ్మాయపల్లె, రాజువారిపేట, చాపాడు గ్రామాల వద్ద పడిపోయిన వరి పైరును వారు పరిశీలించారు. మండలంలో మొత్తం వంద ఎకరాల్లో మాత్రమే వరి పైరు నేలకొరిగినట్లు ఏవో చెప్పారు. రైతులతో అధికారులు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

పోరుమామిళ్లలో: మొంథా తుఫాను తాకిడికి నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి పంపారు. వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి గురువారం పోరుమామిళ్ల మండలంలోని కవలకుంట్ల, టేకూరుపేట, దమ్మనపల్లె ప్రాంతాల్లో పూర్తిగా నీట మునిగిన వరి పైరును పరిశీలించి నష్టపోయిన రైతుల వివరాలు తెలుసుకుని వాటిని నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

అభివృద్ధికి నోచుకోని సూరాయపల్లె


రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

అట్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరాయిపల్లె అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని సీపీఐ ఏరియా కార్యదర్శి ఇమ్మానుయేల్ ఆరోపించారు. గురువారం సీపీఐ నాయకుల బృందం గ్రామాన్ని సందర్శించారు. దశాబ్దాలు గడుస్తున్నా సూరాయపల్లెకు రోడ్లు మంచినీటి సౌకర్యం, డ్రైనేజీలు కరువయ్యాయన్నారు. మణ్యంవారిపల్లె నుంచి సూరాయిపల్లె వరకు సీసీరోడ్డు నిర్మించాలని అలాగే భూమిలేని నిరుపేదలకు భూములు పంపిణీ చేయాలని లేదంటే ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నాచేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శేషారెడ్డి, సుబ్బా రెడ్డి, శ్రీను, వెంకటేశ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. గురువారం శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వర స్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి అమ్మవారికి సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సమస్యలను పరిష్కరిస్తాం

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని ఎర్రబల్లె కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అన్నారు. గురువారం కాలనీని ఆయన సందర్శించి వర్షాలతో నీరు పోక నిలబడిన ప్రదేశాలను పరిశీలించారు.త్వరలోనే అవసరం ఉన్నచోట మోరీలను నిర్మించి కాలువల్లోని పూడికను తొలగిస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ముద్దనూరు అక్టోబర్30(ఆంధ్రజ్యోతి):స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో గురువారం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఐ దస్తగిరి బహుమతులు అందజేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురష్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మలమడుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన కె. రవికుమార్(50) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బొలెరో ఢీకొని తీవ్రంగా గాయపడిన అతన్ని కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఇతను చేనేత కార్మికుడని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు.

దివ్యాంగురాలికి రూ.15వేలు పింఛను ఇవ్వాలి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసన్నపల్లె గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన ధనలక్ష్మికి రూ.15వేలు పింఛను ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సీపీఎం నేతలు వారు నరసన్నపల్లెలోని ధనలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగురాలు ధనలక్ష్మికి పూర్తిగా కాళ్లు, చేతులు పనిచేయకమంచానికే పరిమితమైందన్నారు. సదరం సర్టిఫికెట్‌లో వంద శాతం వచ్చినా కూడా అధికారులు రూ.15వేలు పింఛను మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సానగోవిం దుస్వామి, రెబ్బ నరసింహులుపాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వీధిలైట్లు వెలిగేలా చూడండి

కొండాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కొండాపురం పట్టణంలో ఏర్పాటుచేసిన వీధిలైట్లను వెంటనే వెలిగేలా చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ అధికారులను కోరారు. గురువారం కొండాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగపట్నం టోల్‌ప్లాజా వద్ద అధిక టోల్‌ఫీజు వసూలుచేస్తూ కనీస వసతులు కూడా కల్పించడం లేదని హైవే అధికారులపై మండిపడ్డారు. లైట్లు వెలగకపోవడం వల్ల తరుచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే లైట్లు వెలిగేలా చేయకపోతే హైవేపై ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు.

